సాక్షి విశాఖపట్నం

బుధవారం । 27 । నవంబర్ । 2024



నేవీ మారథాన్‌కు ఏర్పాట్లు

డిసెంబర్ 15న నిర్వహించనున్న 'వైజాగ్ నేవీ మారథాన్' ఏర్పాట్లను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ పరిశీలించారు. 8లో



భగ్గుమన్న కార్మిక లోకం

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని కార్మికలోకం గళమెత్తింది. 8లో



టీచర్లపై కలెక్టర్ ఆగ్రహం

తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులపై కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో



జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఎన్నికల హామీల అమలు కోసం రోడ్డెక్కిన అన్నివర్గాలు
జనంలో పెరుగుతున్న అసంతృప్తి సెగలు
ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతుల వెల్లువ

ఆవేదన ఆగ్రహం

కూటమి **సర్కారు** తీరుపై అన్ని వర్గాల్లో **ఆగ్రహం** కట్టలు తెంచుకుంటోంది. **ఆందోళనలు**, నిరసనలు, ధర్నాలతో జీవీఎంసీ **గాంధీ విగ్రహం** ప్రాంతం, కలెక్టరేట్ ఆవరణలు దద్దరిల్లిపోతున్నాయి. 108, 104 వాహనాల ఉద్యోగులు.. **ప్రభుత్వ ఆస్పత్రుల్లో** పనిచేస్తున్న కాంట్రాక్టు నర్సులు.. **పారిశుధ్య కార్మికులు**.. సెక్యూరిటీ గార్డులు.. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు.. ఆశా వర్కర్లు.. వీవోఏలు.. మధ్యాహ్న భోజన కార్మికులు.. గ్రామ/వార్డు వలంటీర్లు.. మునిసిపల్ ఉపాధ్యాయులు.. అంగన్‌వాడీలు.. దివ్యాంగులు.. తోపుడు బళ్ల వ్యాపారులు.. ఇలా ప్రతి ఒక్కరినీ **సర్కారు రోడ్డున పడేసింది.** తమ సమస్యలు పరిష్కరించండి మొర్రో అని వేడుకుంటున్నా కనికరం చూపించడం లేదు. నెలల తరబడి వేతనాలు అందక కుటుంబాలు ఆకలిచావులకు దగ్గరవుతున్నాయని హాహాకారాలు పెడుతున్నా.. పట్టించుకోవడం లేదు. కూటమి **ప్రభుత్వం** వచ్చిన ఈ ఆరు నెలల్లో రోజుకో ధర్నా.. పూటకో నిరసన అన్నట్లు ఉంది పరిస్థితి.

– సాక్షి, విశాఖపట్నం

అప్పు చేసి వంట వండుతున్నాం

మూడు నెలల బకాయి జీతాలు, బిల్లులు వెంటనే చెల్లించాలంటూ మధ్యాహ్న భోజన పథకాల కార్మికులు ఈ నెల 25న కలెక్టరేట్ ఆవరణలోనూ, ఈనెల 12న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. అప్పులు చేసి వంటలు వండుతున్నామని, ఇప్పుడు దుకాణదారులు కూడా అరువు ఇవ్వడం లేదని వాపోయారు. పిల్లల కోసమని వంట చేస్తున్నా తమ పరిస్థితి దయనీయంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, అక్షయ పాత్రలో పనిచేసే మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రాగి జావ వండినందుకు అదనపు వేతనం చెల్లించాలని లేదా అక్షయపాత్ర సంస్థ వారే రాగిజావ సరఫరా చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.



ఈనెల 22వ తేదీన జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వలంటీర్ల ధర్నా

రోడ్డున పడ్డ వలంటీర్లు

గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికీ సేవలందించడంతో పాటు కరోనా వంటి విపత్తుల సమయంలో సొంత కుటుంబ సభ్యులుగా సాకిన వలంటీర్లను కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసింది. వలంటీర్లను కొనసాగించడంతో పాటు రూ.10 వేలు వేతనం ఇస్తామంటూ చంద్రబాబు ఎన్నికల ముందు బహిరంగంగా ప్రకటించారు. ఇప్పుడు వలంటీర్ వ్యవస్థనే రద్దు చేసేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిని నిరసిస్తూ వలంటీర్లు ఈ నెల 22న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.

చిరు వ్యాపారులపై బ్రహ్మాస్త్రం



కళాభారతి వద్ద తోపుడు బళ్ల వ్యాపారుల ర్యాలీ

రోడ్డు పక్కన చిన్న తోపుడు బళ్లే తమ జీవనాధారంగా బతుకుతున్న బడుగులపైనా కూటమి ప్రభుత్వం బ్రహ్మాస్త్రం సంధించి.. వాళ్లని రోడ్డున పడేసింది. పెదవాల్తేరు సమీపంలో బీచ్ రోడ్డులో ఉన్న 23 తోపుడు బళ్లని జీవీఎంసీ తొలగించేసింది. అదేవిధంగా శివాజీ పార్కు సమీపంలో జనసేన కార్పొరేటర్ ప్రతాపం చూపుతూ ఏకంగా 100కిపైగా బడ్డీల్ని తొలగించేసి.. వాళ్ల బతుకులతో ఆడుకున్నారు. తోపుడు బళ్లని తొలగించడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 22న జీవీఎంసీ గాంధీ విగ్రహం దగ్గర ధర్నా చేశారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఉద్యోగ భద్రత కల్పించాలని 108 ఉద్యోగుల ధర్నా

మూగబోతున్న కుయ్..కుయ్

చిన్న ప్రమాదం జరిగినా.. ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా.. ఒక్క ఫోన్ చేస్తే చాలు.. ప్రాణాలు రక్షించేందుకు కుయ్ కుయ్ మంటూ వచ్చే ఆరోగ్య ప్రదాయినిలు మూగబోయేలా చేస్తోంది కూటమి ప్రభుత్వం.. 108, 104 వాహనాల ఉద్యోగులకు వేతనాలు చెల్లించకపోవడంతో పాటు ఉద్యోగ భద్రత గాల్లో దీపంలా మారిపోయింది. దీంతో ఆరోగ్య వాహనాల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది రోడ్డెక్కారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ 108, 104 ఉద్యోగులు ఈనెల 18న జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వీవోఏలు



ఈనెల 20వ తేదీన జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వీవోఏల నిరసన

మహిళా సంఘాల సహాయకులుగా విధులు నిర్వర్తిస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ (వీవోఏ) ఉద్యోగ భద్రతపై నీలినీడలు కమ్ముకున్నాయి. 2014లో అధికారంలోకి రాగానే వీవోఏలకు ఇచ్చే రూ.2 వేల గౌరవ వేతనాన్ని చంద్రబాబు రద్దు చేశారు. వైఎస్ జగన్ వేతనాలు చెల్లిస్తానని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకంగా రూ.10 వేలకు వేతనం పెంచారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక.. మూడేళ్లే పనిచెయ్యాలంటూ సర్క్యులర్ జారీ చేసింది. దీంతో వీవోఏలు రోడ్డెక్కారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని ఈ నెల 20న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ వెలుగు వీవోఏ(యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

సారూ.. మా వేతనాలు ఎప్పుడు చెల్లిస్తారు.?



ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల ధర్నా

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్‌కు 4 నెలలుగా వేతనాల బకాయిలు చెల్లించడం లేదు. దీంతో వారి కుటుంబాలు పస్తులుంటున్నాయి. వేతనాలివ్వడం లేదని పనికి రాకపోతే.. ఉపాధిపోతుందనే భయంతో రోజూ పని చేస్తున్నారు. ప్రతి రోజూ ప్రభుత్వానికి విన్నవిస్తున్నా పట్టించుకోకపోవడంతో.. బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఈ నెల 13న యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

దశాబ్దాలుగా చేస్తున్నా కనికరం లేదా.?

దశాబ్దాల కాలంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిని కాదని.. సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలని నియమించేలా కూటమి సర్కారు జీవో నం.115 జారీ చేసింది. దీనిపై నిరసన వ్యక్తం చేస్తూ 115 జీవో రద్దు చేయడంతో పాటు తమని రెగ్యులరైజ్ చేయాలంటూ నర్సుల స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24న నిరసన ప్రదర్శన చేపట్టింది.

మా బతుకులు 'చెత్త' పాల్జేసేసిందీ!

ఇచ్చిన ప్రతి హామీనీ తుంగలో తొక్కేసిన కూటమి ప్రభుత్వం.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల జీవితాల్నీ రోడ్డున పడేస్తోంది. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు ఇచ్చిన హామీ ప్రకారం కేజీహెచ్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని కోరుతూ ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ఈనెల 18న ధర్నా నిర్వహించారు. అదేవిధంగా.. మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంపై కేజీహెచ్ సెక్యూరిటీ గార్డులు ఈ నెల 12న లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.



కేజీహెచ్‌లో నిరసన తెలుపుతున్న కార్మికులు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆశ వర్కర్ల ధర్నా

'ఆశ'.. నిరాశగానే..!

ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం వివరాలు సేకరిస్తూ ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించే ఆరోగ్య వారధులుగా విధులు నిర్వర్తిస్తున్న ఆశ వర్కర్లూ.. కూటమి ప్రభుత్వం దయవల్ల రోడ్డెక్కారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రభుత్వం ఇబ్బందులు పెడుతున్న నేపథ్యంలో.. కనీస వేతనాలతో పాటు మట్టి ఖర్చుల కోసం ఇస్తామన్న రూ.20 వేలు హామీ నెరవేర్చాలంటూ ఈ నెల 18న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.

ఇంకా ఎవరెవరు రోడ్డెక్కారంటే..

- దివ్యాంగులకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 28న కలెక్టరేట్ ఎదురుగా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.
- మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 22న డీఈవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.
- హెల్త్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అక్టోబర్ 14న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద యునైటెడ్ విలేజ్ అండ్ వార్డ్ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.
- నూతన మద్యం పాలసీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మహిళా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జీవీఎంసీ వద్ద, జిల్లాలోని పలు ప్రాంతాల్లో ధర్నా నిర్వహించారు.
- భారీగా పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 11న సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.
- ప్రభుత్వం ఉచిత ఇసుక అందించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు జోనల్ కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టారు. పనులు లేక అల్లాడుతున్నామని వాపోయారు.
- ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆస్పత్రి యాజమాన్యం తొలగించిన 38 మంది హౌస్ కీపింగ్ కార్మికులను విధుల్లో కొనసాగించాలంటూ ఈనెల 25వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.
- భీమిలి బీచ్ రోడ్డు రామాద్రి తీరం వెంబడి మత్స్యకారులు ఏర్పాటు చేసుకున్న 45 దుకాణాలను పర్యాటక శాఖ, జీవీఎంసీ అధికారులు ఈనెల 23న తొలగించేశారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వమే తమ జీవితాలతో ఆడుకుంటుంటే, అండగా నిలవాల్సిన నాయకులు ముఖం చాటేస్తుంటే తమ గోడు ఎవరికి చెప్పుకోవాలంటూ ఈనెల 25న వీరంతా ఆందోళనకు దిగారు.

మెయిన్ సెంటర్లగా మార్పు చేయాలని..

అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జీవో ఇవ్వాలని, 42 రోజుల సమ్మె కాలంలో చేసుకున్న ఒప్పందాలకు జీవోలు, సర్క్యులర్లు విడుదల చేయాలని, వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని కోరుతూ ఈనెల 16వ తేదీన జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా

జబ్బరితోటలో డయేరియా

దాబాగార్డెన్స్: బీచ్‌రోడ్డు నేవల్ క్యాంటీన్ ఏరియా జబ్బరితోట పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో 16 డయేరియా కేసులు నమోదయ్యాయి. వీరిలో 9 మంది ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. మిగిలిన ఏడుగురికి ఇంటి వద్దనే చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు మంగళవారం సాయంత్రం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. జీవీఎంసీ కమిషనర్‌తో చర్చించి నీటి శాంపిల్స్ లేబొరేటరీకి పంపించినట్లు తెలిపారు. 24 గంటల వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. 8 మెడికల్ టీంలను ఏర్పాటు చేసి ప్రతి గృహాన్ని సందర్శించి డయేరియా వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్య శిబిరానికి తరలించాలని ఆదేశించామన్నారు. నీటి ద్వారా వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. 37వ వార్డు పరిధి జబ్బరితోటలో గత కొంత కాలంగా తాగునీరు కలుషితం అవుతోందని, చర్యలు చేపట్టాలని గత కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లినట్లు వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ తెలిపారు. అయినా పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు.



డయేరియా సోకిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

టౌన్‌ప్లానింగ్ సెక్రటరీ సస్పెన్షన్

మరో ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు

దాబాగార్డెన్స్: విధుల్లో నిర్లక్ష్యం వహించిన జీవీఎంసీ జోన్–8 టౌన్‌ప్లానింగ్ విభాగం వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ సుబ్బలక్ష్మిని సస్పెండ్ చేస్తూ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అదే జోన్‌లో పర్యవేక్షణలో నిర్లక్ష్య వహించిన అప్పటి టీపీవో తేజేశ్వరరావుతోపాటు ఏసీపీ రఘునాథరావుకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. జోన్–8 పరిధి 97వ వార్డు సుజాతనగర్‌లో ఓ ఇంటి యజమాని తన నివాస భవనానికి స్టిల్ట్ ఫ్లోర్ పార్కింగ్‌కు ఉపయోగించుటకు, గ్రౌండ్ ఫ్లోర్, ఆపై రెండు అంతస్తులు నిర్మించేందుకు జీవీఎంసీ నుంచి అనుమతులు తీసుకున్నారు. కానీ ప్లాన్‌కు విరుద్ధంగా అదనంగా మూడు అంతస్తులు నిర్మించారు. దీనిపై సంబంధిత వార్డు ప్లానింగ్ సెక్రటరీ తగిన వివరణ ఇవ్వకపోవడంతోపాటు విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు గాను జీవీఎంసీ కమిషనర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదే జోన్‌లో గతంలో విధులు నిర్వహించిన టౌన్ ప్లానింగ్ అధికారి డి.తేజేశ్వరరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఇన్‌చార్జి) సీహెచ్.రఘునాథరావు విధుల పట్ల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించినందుకు గాను షోకాజ్ నోటీసులు జారీ చేసి, నిర్ణీత గడువులోగా తగిన వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ ఎద్దేవా

దాబాగార్డెన్స్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడిచి, రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆక్షేపించారు. పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ నేతృత్వంలో మంగళవారం డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అతి పెద్ద రాజ్యాంగాన్ని రచించి ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలిచిన అంబేడ్కర్ స్ఫూర్తిని కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. చంద్రబాబు తనయుడు లోకేష్ రచించిన రెడ్‌బుక్‌తోనే రాష్ట్రంలో పాలన సాగుతోందన్నారు. కావాలనే ఒక వర్గం పైనే కేసులు బనాయించి, బెదిరింపులు, దాడులు, హత్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎన్ని దాడులు, బెదిరింపులకు పాల్పడినా ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ నిలిచి పోరాడుతుందన్నారు. రైల్వే జోన్ స్థలం విషయంపై మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ 2020 జనవరి మొదటి వారంలో రైల్వే జోన్‌కి సంబంధించి ముడసర్లోవలో స్థలం కేటాయించామని, రికార్డులు పరిశీలించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో రూ.లక్షా 20 వేల కోట్ల పెట్టుబడులతో పెద్ద కంపెనీలు వస్తున్నాయంటే అది వైఎస్సార్ సీపీ చొరవేనన్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, కరణం ధర్మశ్రీ, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాన్‌వెస్లీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, కార్పొరేటర్లు చెన్నా జానకీరామ్, బిపిన్‌కుమార్ జైన్, పార్టీ ముఖ్య నాయకులు కంట్రెడి రామన్నపాత్రుడు, ఐహెచ్ ఫరూఖీ, డాక్టర్ జహీర్ అహ్మద్, దొడ్డి బాపూ ఆనంద్, పల్లా అప్పలకొండ, మొల్లి అప్పారావు, తుల్లి చంద్రశేఖర్, పీతల వాసు, అలఫున కనకారెడ్డి, నడింపల్లి కృష్ణంరాజు, పేడాడ రమణకుమారి, వంకాయల మారుతీప్రసాద్, ఆల్ఫా కృష్ణ, డాక్టర్ మూగి శ్రీనివాసరావు, పచ్చిరపల్లి రాము, పాక సత్యనారాయణ, మాసిపోగు రాజు, ముజీబ్‌ఖాన్, లండా రమణ, సనపల రవీంద్రభరత్, ముత్తాబత్తుల రమేష్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

7న మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం

మహారాణిపేట : పిల్లల బంగారు భవిష్యత్తు కోసం–బడి వైపు ఒక అడుగు అనే నినాదంతో డిసెంబర్ 7న నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్స్(పీటీఎం) సమావేశం విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులతో శనివారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 11 మండలాల పరిధిలోని ఉన్న 595 ప్రభుత్వ పాఠశాల్లో పీటీఎం సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం వల్ల పాఠశాలలు, తల్లిదండ్రుల మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. పోషకాహారం, పిల్లల భద్రత అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామన్నారు. డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్, ఉప విద్యాశాఖ అధికారి సోమేశ్వరరావు, ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.4 లక్షల విరాళం



దాత భాస్కరరావుకు బాండ్ అందజేస్తున్న ఏఈవో రాంబాబు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం విశాఖలోని సుజాతనగర్‌కు చెందిన వై.భాస్కరరావు రూ.4 లక్షల విరాళాన్ని అందజేశారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున పీఆర్‌వో కార్యాలయంలో ప్రొటోకాల్ ఏఈవో వి.రాంబాబు దాతకు బాండ్‌ను అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు. పీఆర్‌వో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ వరాహ నరసింహం, అన్నదాన విభాగం ఉద్యోగి హరి పాల్గొన్నారు.

దాతలు ముందుకురావాలి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో నడుస్తున్న బాల్యం విద్యా కేంద్రాలకు సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ పిలుపునిచ్చారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి అందించిన యూనిఫాం క్లాత్, దాతలు సమకూర్చిన స్కూల్ బెల్ట్, షూ, సాక్స్‌లను మంగళవారం కమిషనర్ అందజేశారు. కార్యక్రమంలో బాల్యం విద్యా పథకం సహాయకుడు ఆవుపాటి మోహన్‌కుమార్, అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, బాల్యం విద్యా కేంద్రాల సూపర్‌వైజర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

30న పెన్షన్ల పంపిణీ

మహారాణిపేట: ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఈనెల 30వ తేదీన పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. జిల్లాలో డిసెంబర్ నెలకు 1,61,584 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, నాలుగు గ్రామీణ మండలాల్లో 26,732 మంది, పట్టణ ప్రాంతాల్లో 1,34,852 మంది పింఛను దారులు ఉన్నారని పేర్కొన్నారు. ఇందుకోసం రూ.69.71 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. డిసెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ముందురోజు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 30వ తేదీన ఏమైనా సాంకేతిక సమస్యలు ఏర్పడితే డిసెంబర్ 2వ తేదీన పింఛన్ అందజేయాలని ఆదేశాలు ఇచ్చినట్టు కలెక్టర్ వివరించారు. అందుబాటులో లేని పింఛనుదారులు మూడు నెలల పింఛను ఒకే సారి తీసుకోవచ్చన్నారు.



జెడ్పీ సమావేశమందిరంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి



జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, కమిషనర్ సంపత్ కుమార్, అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి తదితరులు.



ఏఆర్ పోలీస్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న డీఐజీ గోపినాథ్ జెట్టి.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

మహారాణిపేట: ఎందరో త్యాగధనుల కృషి, శ్రమఫలితంగా రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ ప్రతి ఒక్కరూ తమ విధులను, కర్తవ్యాలను అంతఃకరణ శుద్ధితో నిర్వర్తించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ఆవిర్భవించి 75 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్. భవానీ శంకర్ తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగ పీఠికను చదివి వినిపించగా వారిని అనుసరిస్తూ కలెక్టరేట్ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ సోదరభావంతో మెలగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, ఎస్.ఐ.సి. అధికారి పాషా పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, అధికారులు



ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ సంపత్ కుమార్, ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

భావితరాలకు స్ఫూర్తి..అంబేడ్కర్

ఏయూక్యాంపస్: భావితరాలకు స్ఫూర్తిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిలుస్తారని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ సంపత్ కుమార్ అన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని బీచ్‌రోడ్డులో మంగళవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఆలుమ్ని వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ అంబేడ్కర్ ర్యాలీని, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ ఆలుమ్ని అధ్యక్షుడు ఆచార్య కోటి జాన్ , కార్యదర్శి ఆరేటి మహేష్, డాక్టర్ బి.మోహన్ బాబు, డాక్టర్ సుధీర్ పాల్, ఏయూ ప్రిన్సిపాల్స్ ఆచార్య ఏ.నరసింహా రావు, ఎంవీఆర్ రాజు, ఎస్.విజయ్ మోహన్, టి.వెంకట కృష్ణ, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వర రావు, ఆచార్య ప్రేమానందం, ఎస్సీ, ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య టి.షారోన్ రాజు, ఆచార్య సుబ్బారావు, ఆచార్య ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం

- తోటగరువు జెడ్పీ పాఠశాల సందర్శన
- భోజన శాల నిర్వహణపై అసంతృప్తి

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులపై కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మధ్యాహ్న పథకం సరుకులు పక్కదారి' అనే శీర్షికతో ఈనెల 24న సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్‌కుమార్, మిడ్ డే మీల్ విభాగం అధికారులు, ఎంఈవోలతో కలిసి కలెక్టర్ మంగళవారం పాఠశాలను సందర్శించారు. ఇక్కడ వంటశాల, మిడ్ డే మీల్ వంటలు పరిశీలించారు. భోజన సమయంలో విద్యార్థులతో కొంతసేపు మాట్లాడి పరిస్థితులు తెలుసుకొన్నారు. మిడ్ డే మీల్ రికార్డులు పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న వంటశాల, భోజనాలు పెట్టే స్థలంతోపాటు పాఠశాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు ఆడుకోవడానికి అనుకూలమైన పరిస్థితులు కల్పించాలన్నారు. ఇదిలావుండగా 'సాక్షి' కథనంతో ఉపాధ్యాయులు ఉలిక్కిపడ్డారు. పాఠశాల పరిశీలనకు కలెక్టర్ వస్తారని ముందుగానే వారికి తెలియడంతో జాగ్రత్త పడ్డారు. రోజూవారీ మాదిరిగా కాకుండా నాణ్యమైన వంటలు దగ్గరుండి వండించారు. అయితే వంటశాలను, విద్యార్థులకు పెట్టే భోజన స్థలాన్ని శుభ్రం చేయకపోవడంతో కలెక్టర్ ఆగ్రహానికి గురికాక తప్పలేదు.

ముగిసిన ఎస్ఐ పదోన్నతుల అర్హత పరీక్షలు

ఆరిలోవ: విశాఖ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతులు కోసం నిర్వహించిన అర్హత పరీక్షలు మంగళవారం ముగిశాయి. రెండో రోజు అభ్యర్థులకు అవుట్ డోర్, మౌఖిక పరీక్షలు, టర్న్ అవుట్, స్క్వాడ్ డ్రిల్, ఆయుధ కవాతు, ఆయుధాలు ఖోల్నా–జోడ్నా, నేరస్థల పరిశీలన తదితర వాటిలో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ గోపినాథ్ జట్టి మాట్లాడుతూ రెండు రోజులు పాటు జరిగిన ఈ పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో నిష్పక్షపాతంగా నిర్వహించామన్నారు. 40 మంది అభ్యర్థులు పాల్గొన్నారన్నారు. అనంతరం అర్హులైనవారందరినీ తిరుపతిలో డిసెంబరు 2 నుంచి ప్రారంభంకానున్న ఎస్.ఐ శిక్షణకు పంపిస్తామన్నారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐదో బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్ పాల్గొన్నారు.

'పాట'కుల శేఖరుడు



- సినీ గేయరచయిత కులశేఖర్ మృతి
- సింహాచలం జన్మస్థలం
- విలేకరిగా జీవిత ప్రస్థానం
- సిరివెన్నెల సీతారామశాస్త్రి శిష్యుడిగా గుర్తింపు
- ఎన్నో పాటలకు సాహిత్యం అందించిన గేయరచయిత

సింహాచలం: గాజువాక పిల్లా...మేము గాజులోల్లం కాదా..... అంటూ తన సాహిత్యంతో సినీ ప్రేక్షకులను ఉర్రూతలూగించిన గేయరచయిత కులశేఖర్ (53) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం హైదరాబాద్‌లో మృతిచెందారు. సింహాచలంలో జన్మించిన ఆయన అనతికాలంలోనే తెలుగు సినీ పరిశ్రమలో గేయ రచయితగా ఎంతో మంచి పేరు తెచ్చుకున్నారు. నగరంలోని ఒక కళాశాలలో డిగ్రీ, ఏయూలో ఎంఏ సంస్కృతం చదివిన కులశేఖర్ తొలినాళ్లలో విశాఖలోనే ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేశారు. ఆ తర్వాత ఓ చానల్‌లో ఉద్యోగంలో చేశారు. ఆదినుంచీ తెలుగు భాష, సాహిత్యంపైన పట్టు ఉన్న కులశేఖర్‌కు సినీ గేయరచయిత అవ్వాలన్న కోరిక ఉండేది. ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రితో పరిచయం ఉండటంతో ఆయనవద్ద శిష్యుడిగా చేరారు. 2000 సంవత్సరంలో వచ్చిన 'చిత్రం' సినిమా ద్వారా గేయరచయితగా సినీ రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత అనతికాలంలో ఎంతో ఎత్తుకు ఎదిగారు. అప్పటి యువత హృదయాలను హత్తుకునే ఎన్నో పాటలకు కులశేఖర్ సాహిత్యం అందించారు. నువ్వు నేను, జయం, సంతోషం, ఇంద్ర, నిజం, వసంతం, ఘర్షణ, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే.. తదితర చిత్రాలకు పాటలు రాశారు. వెంకటేష్ నటించిన ఘర్షణ చిత్రానికి మాటలు కూడా కులశేఖరే అందించారు.

సింహాచలం స్థానాచార్యులు రాజగోపాల్‌కు సోదరుడు

కులశేఖర్ తండ్రి పేరు టి.పి.శ్రీరామచంద్రాచార్యులు, తల్లి రంగనాయకమ్మ. వీరికి తొమ్మిదిమంది సంతానం.. కాగా కులశేఖర్ ఆఖరివాడు. శ్రీ రామచంద్రాచార్యులు నగరంలోని ఏవీఎన్ కళాశాలలో తెలుగు విభాగాధిపతిగా పనిచేసి 2012లో పరమపదించారు. కులశేఖర్‌కి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సింహాచలం దేవస్థానంలో ప్రస్తుతం స్థానాచార్యులుగా విధులు నిర్వర్తిస్తున్న టి.పి.రాజగోపాల్ కులశేఖర్ సోదరుడే. కులశేఖర్ మృతిచెందాడన్న వార్త సింహాచలం గ్రామస్తులను కలచివేసింది. సామాజిక మాధ్యమాల్లో కులశేఖర్ మృతిచెందారన్న వార్తలను చూసి కంటతడి పెట్టారు. ఆయన అందించిన పాటలను పలువురు గుర్తుచేసుకున్నారు.

కేంద్ర విధానాలపై భగ్గుమన్న కార్మిక లోకం

- ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలి
- 4 లేబర్ చట్టాలను రద్దు చేయాలి
- కార్మిక సంఘాల భారీ ప్రదర్శన

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని కార్మికలోకం గళమెత్తింది. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు మంగళవారం దొండపర్తి డీఆర్ఎం ఆఫీస్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌తో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చర్యలను ఆపాలని, కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు తక్కువ లేకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. వివిధ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్నం భోజనం, వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. అసంఘటితరంగ కార్మికులైన ముఠా, తోపుడు బళ్లు, ఆటో, భవన నిర్మాణ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ధరలు నియంత్రించాలని, రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలన్నారు. విద్యుత్తు సంస్కరణ చట్టం 2020ను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను విరమించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాల్సిన ప్రధాని మోదీ..వాటిని అమ్మే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తన విధానాలను మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ప్రదర్శనలో మున్సిపల్, ముఠా, బిల్డింగ్, ఆటో, ఆశ, అంగన్‌వాడీ, మిడ్డే మీల్స్, వీవోఏ, వివిధ ప్రభుత్వ రంగకార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, పి.మణి, జగన్, ఏఐటీయూసీ నాయకులు ఆదినారాయణ, అచ్యుతారావు, రెహమాన్, ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి రాజశేఖర్, బి.నాగభూషణం, రామచంద్రరావు, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, తిరుపతి, సీఎఫ్‌టీయూఐ నాయకులు కనకారావు, ఏపీఎఫ్‌టీయూఐ నాయకులు దేవా, ఏఐసీటీయూ నాయకులు శంకరావు, ఏఐసీసీటీయూ నాయకులు వాసుదేవరావు తదితరులు ప్రసంగించారు. వెంకటరెడ్డి, సుబ్బారావు, అప్పలరాజు, కుమార మంగళం, నూకరాజు, రాజు, వెంకటరావు, పద్మ, వెంకటలక్ష్మి, మంగశ్రీ, సురేష్, లక్ష్మి, కాసుబాబు, సత్యంజనేయ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

షిప్‌యార్డ్‌లో తోషిబా బ్యాటరీ ప్రతినిధులు

సింధియా: సముద్ర రంగం కోసం అధునాతన ఇంధన నిల్వల పరిష్కారాలను అన్వేషించేందుకు జపాన్‌కు చెందిన తోషిబా బ్యాటరీ విభాగ బృందం మంగళవారం హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌ను సందర్శించింది. తోషిబా బ్యాటరీ సేల్స్ అండ్ బిజినెస్ హెడ్ సతో గోరో–సాన్, ఇండియా డైరెక్టర్ కజుటకా నిషిమూరా–సాన్, ఇండియా సేల్స్ ఇన్‌చార్జ్ రాకేష్ ట్రక్రూ నేతృత్వంలోని బృందం ఎల్‌డబ్ల్యూటీ గ్రూప్‌నకు చెందిన సింగ్ మణిందర్‌తో కలిసి షిప్‌యార్డ్‌లో పర్యటించారు. హెచ్ఎస్ఎల్ సీఎండీ గిర్దీప్ సింగ్ మెరైన్ బ్యాటరీ విషయాలను సమగ్రంగా వివరించారు. తోషిబా నుంచి అత్యాధునిక లిథియం టైటానియం ఆక్సైడ్ బ్యాటరీ సాంకేతికతపై చర్చించారు.



జపాన్‌లోని తోషిబా బ్యాటరీ విభాగ ప్రతినిధి బృందంతో చర్చలు జరుపుతున్న హెచ్ఎస్ఎల్ సిబ్బంది

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: రాయగడ–విజయనగరం సెక్షన్, కోమటిపల్లి స్టేషన్ పరిధిలో ఆధునీకరణ పనుల నేపథ్యంలో ఆయా తేదీల్లో పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–కోరాపుట్(18512) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29, డిసెంబరు 2వ తేదీల్లో, కోరాపుట్–విశాఖపట్నం(18511)బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30, డిసెంబరు 3వ తేదీల్లో, విశాఖపట్నం–కోరాపుట్(08546) పాసింజర్ స్పెషల్ ఈ నెల 29, డిసెంబరు 4వ తేదీల్లో, కోరాపుట్–విశాఖపట్నం(08545) పాసింజర్ స్పెషల్ ఈనెల 29, డిసెంబరు 5వ తేదీల్లో రద్దు చేశారు.

గమ్యం కుదించిన రైళ్లు: ఈ నెల 28 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు గుంటూరు–రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది. రాయగడ–గుంటూరు (172 44) ఎక్స్‌ప్రెస్ డిసెంబరు 4వ తేదీ వరకు విజయనగరం నుంచి బయల్దేరుతుంది.

కిరండూల్‌కు అదనపు విస్టాడోమ్ కోచ్: ఈ సీజన్‌లో అరకు అందాలను వీక్షించే పర్యాటకులు, ప్రయాణికుల సౌకర్యార్థం, వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల జాబితాను క్లియర్ చేసేందుకు కిరండూల్ రైళ్లకు ఆయా తేదీల్లో అదనపు కోచ్‌ను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 5,7,9,11, 13,15,17,19,21,23,25, 27,29,31వ తేదీల్లో, తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 6,8,10,12,14,16, 18,20,22, 24,26,28,30, జనవరి 1వ తేదీల్లో కిరండూల్‌కు ఒక విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేవీ మారథాన్ ఏర్పాట్ల పరిశీలన

దాబాగార్డెన్స్: నగరంలో డిసెంబర్ 15న నిర్వహించనున్న 'వైజాగ్ నేవీ మారథాన్' ఏర్పాట్లను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. బీచ్ రోడ్డులో 42 కిలోమీటర్ల మేర (ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు) నేవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మారథాన్ ఏర్పాట్లు, వివరాలను కెప్టెన్, రేస్ డైరెక్టర్ టీఆర్ఎస్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రధాన ఇంజనీర్ శివప్రసాదరాజు, సీసీపీ ప్రభాకరరావు, జోనల్ కమిషనర్ శివప్రసాద్, అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణను ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ శ్యాంసన్‌రాజు, డీసీపీ హరిదాసు పాల్గొన్నారు.

జాయ్ లెనివాపై అన్యాయంగా కేసులు


సీపీపై మాజీ ఎంపీ హర్షకుమార్ ఆరోపణలు



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

అల్లిపురం: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిపై మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. హనీ ట్రాప్ పేరుతో జాయ్ లెనీవాపై అన్యాయంగా కేసులు నమోదు చేశారన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం సెంట్రల్ జైలుకు వెళ్లి జాయ్ లెనివాను పరామర్శించి వచ్చానని తెలిపారు. జాయ్ లెనీవా హనీట్రాప్ చేసి చాలామందిని దోచుకుందని, ఆమె వెనుక పెద్ద ముఠా ఉందని, తనను కూడా హిప్నటైజ్ చేస్తుందని భయపడి ఆమెను అరెస్ట్ చేసే వరకు తాను విచారణ చేసేందుకు వెళ్లలేదని స్వయంగా సీపీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. యూ ట్యూబ్ చానల్స్ అయితే పండగ చేసుకున్నాయన్నారు. హనీట్రాప్‌కు సంబంధించినవి సెక్షన్లు పెట్టాల్సి ఉండగా, మూడు కేసుల్లో అటెంప్ట్ టు మర్డర్ సెక్షన్లు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఆమె వెనుక ఉన్న ముఠాలో ఎంత మందిని అరెస్ట్ చేశారంటూ సీపీని ప్రశ్నించారు. ఆమె నుంచి కేజీ బంగారం, అరకేజీ వెండి స్వాధీనం చేసుకున్నారని పోలీసులు చెప్పారు. అవి ఎక్కడ పెట్టారో చెప్పాలన్నారు. ఆ సొత్తును కోర్టుకు అప్పగించాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. అమాయకురాలైన జాయ్ లెనివా కారెక్టర్‌ను తప్పుపడుతూ సమాజాన్ని, మీడియాను తప్పుదోవ పట్టించిన సీపీకి ఏ శిక్ష వేసినా తప్పులేదన్నారు.


హీమోఫిలియా బాధితులకు మెరుగైన వైద్యం



బాధిత పిల్లలతో కేక్ చేయిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్

మహారాణిపేట: కేజీహెచ్‌లోని పీడియాట్రిక్ విభాగంలో హీమోఫిలియా ఇన్హిబిటర్ రోగులకు మెరుగైన చికిత్స నిర్వహించారు. రోగికి రూ.43 వేలు విలువగల మందులు వినియోగించాలి. ఇలా ఏడాదికి రూ.26 లక్షలు ఖర్చు అవుతుంది. కేజీహెచ్ పిల్లల వార్డులో హీమోఫిలియా సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఇద్దరికి రూ.52 లక్షలు విలువగల మందులతో చికిత్స అందజేశామని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. కార్యక్రమంలో బాధిత చిన్నారులతో పాటు పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ బి.ఎస్. చక్రవర్తి, ప్రొఫెసర్ డాక్టర్ రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రితో అక్షయ ఇన్ఫోటెక్ ప్రతినిధుల భేటీ



మంత్రితో అక్షయ ఇన్ఫోటెక్ ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో అక్షయ ఇన్ఫోటెక్ ప్రతినిధులు మంగళవారం భేటీ అయ్యారు. నగరానికి వచ్చిన మంత్రికి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి తమ సంస్థ అందిస్తున్న అత్యాధునిక సాంకేతిక పద్ధతులను వివరించారు. తమ సంస్థ చేపట్టిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టంను గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంలో అమలు చేసేందుకు మంత్రి చంద్రశేఖర్ ఆసక్తి చూపారని అక్షయ ఇన్ఫోటెక్ మేనేజింగ్ పార్టనర్ డాక్టర్ రేణు శరత్ బాబు తెలిపారు. సమావేశంలో సంస్థ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున్, ఎస్.మోహన్ పాల్గొన్నారు.